కథ

# దెయ్యం

## గోసులపాటి శ్రీధర రావు

సరిగ్గా ముప్ఫయ్ ఏళ్ళ క్రితం జరిగిన విషయమది. ఆ రోజుల్లో ఇప్పుడున్నట్టుగా కొయాక్సిల్, మైక్రోవేవ్ టెలికమ్ నెట్ వర్క్ లేదు. కేవలం ఓవర్ హెడ్ ఫోన్స్ తోనే టెలిఫోన్ లైన్లు పని చేసేవి. ఎక్కడ ఫాల్ట్ వచ్చినా చాలా కష్టమై పోతుండేది లైన్లు రైటవడానికి. అంతా రోడ్ సైడ్ కన్స్ట్రక్షన్ చేశారు. విజయవాడ– హైదరాబాద్ హైవేలో లైన్లు వుండేవి. అప్పుడు లైన్లు ఒక్కొక్క చోట క్రాస్ కంట్రీలో సుమారు రెండు ఫర్లాంగుల దూరంలోనే వుండేవి. అంటే రోడ్ నుంచి లైన్లుండే ఎలైన్‌మెంట్‌కు దూరంగా వుండేదన్నమాట.

రాత్రి సుమారు తొమ్మిది గంటలైంది. రేడియోలో వార్తలు వింటున్న కుమార్ గుండెల్లో రాయి పడ్డట్టయింది. కాకినాడ వద్ద ఏర్పడిన వాయుగుండం తీరాన్ని దాటింది. కోస్తా జిల్లాల్లోనూ, ఖమ్మం, నల్గొండ జిల్లాల్లోనూ పెనుగాలులతో కుంభవృష్టి పడుతుందని విన్న కుమార్‌కు అంత చలిలోనూ ముచ్చెమటలు పోశాయి. ఇంతలో ట్రింగ్ ట్రింగ్ ట్రింగ్ మంటూ ఫోన్ మోగింది. రిసీవర్ అందుకున్న కుమార్ "కుమార్ స్పీకింగ్" అన్నాడు.

"మిస్టర్ కుమార్! ఇంత వరకూ లైన్లు క్లియర్ కాలేదు. కోస్టల్ సైడంతా టెలిఫోన్ సౌకర్యం కటాఫ్ అయ్యింది. ట్రంకాల్స్ బందైతే ఎంత మాటొస్తుందో, జనం ఎంత సఫరవుతారో ఆలోచించు. వర్షం ఎక్కువౌతోంది. మనవాళ్ళేం చేస్తున్నారో! యూ బెటర్ ప్రొసీడ్"– ఆఫీసర్ ఆదేశం.

'ఫాల్టున్న సెక్షన్ కంచికచర్ల, పరిటాల మధ్య సార్. విజయవాడ నుంచి ఇద్దరు లైన్‌మెన్లను పంపించాను. నందిగామ నుంచి విజయవాడ సైడుకు లైన్‌మేన్ ప్రొసీడయ్యాడు. ఈపాటికి లైన్లు రైటవ్వాలి. బహుశా వర్షం ఎక్కువై వుంటుందక్కడ! ఎనీవే ఐ విల్ ప్రొసీడ్ ఇమ్మీడియెట్లీ" అన్నాడు.

"బి క్విక్" అవతలి గొంతు టెలిఫోన్ పెట్టేస్తూ అంది.

* * *

జీప్ నందిగామ చేరేసరికి సరిగ్గా రెండు గంటలైంది. కోదాడ నుంచే వర్షం ఎక్కువైంది. ఈదురు గాలులు వీస్తున్నాయి. జీప్ లైట్లు, ఎదురుగా నేషనల్ హైవే మీద వచ్చే లారీల లైట్లే ఆధారమైనాయి రోడ్డు కన్పించడానికి. అప్పుడప్పుడు మెరుపులు దర్శనమౌతున్నాయి. నందిగామ తర్వాత జీపును వేగంగా నడిపించలేకపోతున్నాడు డ్రైవరు. కొంత సేపటికి వున్నట్టుండి జీప్ సడన్‌గా ఆగింది. "ఏం ఆపావే?" అడిగాడు కుమార్.

"నేనాప లేదు సార్! అదే ఆగిపోయింది" అన్నాడు డ్రైవరు అఫ్జల్. చార్జి లైటు కేసి చూశాడు ఎందుకాగిందో చూద్దామని బోనెట్ ఎత్తాడు డ్రైవరు. మైలురాయిని చూస్తే 134 కి.మీ. నెంబర్ కన్పించింది. "సర్ కంచికచర్ల వచ్చాం" అన్నాడు లైన్‌మేన్ యోబు. "ఇక్కడి నుంచి రోడ్ క్రాస్ చేసి పొలాల్లోంచి రెండు ఫర్లాంగులు వెడితే గాని లైన్లు కనపడవు సార్" అన్నాడు మొహియుద్దీన్. చలి ఎక్కువైంది. గాలి చెవుల్లోకి హోరుమని వీస్తోంది. కాలు తీసి కాలు పెడితే బురద నీళ్ళు. ఒక పక్క వర్షం జోరుగా కురుస్తోంది. అతికష్టం మీద నడుస్తున్నారు వాళ్ళు. మొహియుద్దీన్ ముందు నడుస్తున్నాడు. ఉన్నట్టుండి మొహియుద్దీన్ "సార్! ఇందాకటి నుంచీ మనల్ని ఒక దెయ్యం వెంటాడుతోంది. కీసర బ్రిడ్జి నుంచి గమనించారా సార్?" అన్నాడు.

"అదేమిటి ఎక్కడా కన్పించలేదే?"

"సార్ మన జీవు సడన్‌గా ఎందుకాగిందనుకున్నారు? వైపర్ కూడా పని చేయలేదు. కారణం తెలియదా సార్? ఆ మాత్రం ఊహించుకోలేరూ?"

"ఊహించదల్చుకుంటే ఏదైనా ఊహించుకోవచ్చు".

"అది కాదు సార్! ఇంత వరకు లైన్లు రైట్ కాలేదంటే ఈ దెయ్యమే కారణం",

"ఆవు మొహియుద్దీన్ నీ వుపనఆయసం నాక్కూ కొత్త కాదులే"

"మీరలాగే అంటారు సార్! ఇక్కడ ఇదివరకు ఈ వూరి కరణం గారమ్మాయి నూతిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. అప్పటి నుంచీ ఈ ప్రాంతంలో దెయ్యమై తిరుగుతుందట! అందుకే రాత్రిపూట ఇకఇకడి వాళ్ళు బైటికి రారు సార్. చుట్టు పక్కల ఆ దెయ్యం తిరుగుతూ వుండటం మూలంగా అందరూ భయపడుతూ వుంటారు. మనవాళ్ళు కూడా తెల్లారిన తర్వాతే ఫాల్టులు చూస్తారు సర్".

"కోతలు కోయకు. అంతా చూసినట్టు చెబుతున్నావే!"

"కోతలు కాదు సర్. నేను దెయ్యాన్ని చూశాను. అందుకనే చెబుతున్నా. దెయ్యాలు రకరకాలు సార్. కొరివి దెయ్యం, తురక దెయ్యం, సైతాను దెయ్యం, భూతం, శాకినీ.." అంటూ ఏమిటేమిటో చెప్పసాగాడు.

అందరూ నడుస్తున్నారు. వర్షం పడుతూనే వుంది. మొహియుద్దీన్ని ఆటపట్టిద్దామని కుమార్–

"నువ్వే దెయ్యాన్ని చూశావు" అనడిగాడు.

"సైతాను దెయ్యాన్ని".

"ఎక్కడ?"

"మన టాంక్ బండ్ మీద".

"ఎప్పుడు?"

"రెండేళ్ళయ్యింది సార్. ఒక రోజు బోట్ క్లబ్ దాటి టాంకు బణడ్ మీదుగా వస్తున్నా. అక్కడ కుడి వైపు మసీదొకటి వుంది. మీరు చూసే వుంటారు. అది దాటి పది పదిహేను గజాలు పోయాక ఏదో ఒక్క సారిగా వెనుక బోల్డంత బరువును మోసినట్టనిపించింది. సైకిలు స్పీడుగా పోవడం లేదు. వెనుక బరువెక్కువగా వుండటం వల్ల ఎంత బలంగా తొక్కినా కూడా సైకిలు ముందుకు స్లోగా పోతోంది గాది ముందున్న స్పీడు మాత్రం లేదు.

ఎదురు గాలి కూడా లేదు. ఏమైనా సరేనని గట్టిగా, బలంగా సైకిల్ తొక్కనారంభించాను వెనక్కి చూడకుండా".

"వెనక్కెందుకు చూడలా?" యోబు ప్రశ్న.

'వెనక్కి చూడకూడదు. చూశామా మనల్ని పట్టేస్తుంది. వదల్దు. రాత్రి అంతా అక్కడే వుండేటట్టు చేస్తుంది. ఆ దెయ్యాల తీరే అంత! గుండె ధైర్యంతో ముందుకు సాగిపోతేనే గాని పిరికి వాడిలా వెనక్కి చూడకూడదు".

"కారణం?"

"హుస్సేన్ సాగర్‌లో చాలా మంది ఆత్మహత్యలు చేసుకుంటారు. వాళ్ళ కోరికలు తీరకుండానే చచ్చిపోవడం వల్ల దెయ్యాలుగా మారి అక్కడక్కడే ఆ ప్రాంతంలోనే తిరుగుతూ వుంటారు సార్. అయితే వాళ్ళు వెంట పడ్డప్పుడు మనతోపాటుగా రాకుండా హుస్సేన్ సాగర్ అంత మయ్యేటప్పటికి అంటే మళ్ళీ లిబర్టీ దగ్గరికొచ్చే సరికి మాయమైపోతాయి. ఎందుకంటే దెయ్యాలు నీటిలో పడి ఆత్మహత్య చేసుకున్న వాళ్ళ తాలూకు. కనుక నీటి వాతావరణం వుండాలి పరిసరాల్లో. అందుకని తెల్లవార్లూ అంటే తెల్లవారు ఝామున నాలుగూ అయిదూ గంటల మధ్య టాంక్ బండ్ చివరలో మాయమైపోతాయి. వీటినే సైతాను దెయ్యాలు అని అంటారు. ఇక్కడ ఈ వూళ్ళో కరణం గారి అమ్మాయి నూతిలో పడి ఆత్మహత్య చేసుకుందని చెప్పాగా సార్. అందుకని కొరివి దెయ్యం అయి వుంటుంది. కొరివి దెయ్యాలు చాలా డేంజర్. పట్టుకుంటే వదలవు. మొండివి. శాంతి చేయించుకోవాలి సార్" అంటూ ఏమేమో చెప్పుకుపోతున్నాడు కుమార్ అడ్డు తగిలి–

"నీ కథ మాత్రం వినడానికి బాగుంది. మనం తిరిగి హెడ్ క్వార్టర్స్‌కి వెళ్ళిన తర్వాత చెప్ప తీరిగ్గా వింటాం. ప్రస్తుతానికి లైన్ల మీద దృష్టి పెట్టి ముందుకు పద!".

* * *

కాలు తీసి కాలు పెట్టాలంటే చాలా కష్టంగా వుంది. పొలాల మూలంగా కావలసినంత రొచ్చూ, బురదా! అంతా రేగడి మట్టి. వర్షం తగ్గలేదు. మొహం మీద నుంచి కళ్ళల్లోకి వస్తున్నాయి వర్షపు నీళ్ళు. కీచురాళ్ళ ధ్వనులు, కప్పల బెకబెకలు వాతావరణాన్ని మరింత భయంకరంగా మార్చుతున్నట్టనిపిస్తోంది. చలి విపరీతంగా వుంది. మెరుపుల వెలుతురు తప్ప ఏమీ కన్పించడం లేదు. టార్చి



లైట్ల వెలుతురులో ముందుకు సాగుతున్నారు అందరూ. సిమ్లాలో కుఫ్రీ కొండ లోయల్లో వున్నట్టుంది. అతి కష్టం మీద ఎలైన్‌మెంట్ దగ్గరకు చేరారు. ఫాల్టు టిపికల్‌గా వుంది కనుక లేడర్ ఇన్‌స్పెక్షన్ చేద్దామని కుమార్ అన్నాడు. యోబు నిచ్చెన ఒక స్తంభానికి వేశాడు. ఫాల్టు దొరకలేదు. అలా ఒకరి తర్వాత ఒకరు పోల్ ఎక్కి చూద్దామన్నాడు. యోబు, మొహియుద్దీన్ అలా చేయటం మొదలెట్టారు. ఫాల్టు ఎక్కడా దొరకలేదు. అలా కనీసం పది స్తంభాలనెక్కి జాగ్రత్తగా చూశారు. కుమార్‌కి టెన్షన్ పెరిగింది అసలు ఫాల్టు దొరుకుతుందా? అని. అందరూ అలసి పోవడమే కాక తడిసిపోయారు పూర్తిగా. టార్చిలైట్లు డిమ్ అయిపోయాయి. ఉన్నట్టుండి "స సార్! దె దెయ్యం సార్! మన వైపే వస్తోంది సార్! తనవైపు రమ్మని సైగలు చేస్తోంది. మనకీ, దానికీ మధ్య నాలుగైదు స్పానులు (స్తంభాల మధ్య నిడివి) వుంటుందేమో సార్!" అంటూ ఒక్క ఉదుటున వురికేశాడు మొహియుద్దీన్. కుమార్ నమ్మలేదు. తనే ఎక్కాడు నిచ్చెన. నిశితంగా చూశాడు. మొహియుద్దీన్ చెప్పింది నిజమేనన్పిస్తోంది. కొద్ది దూరంలో రెండు కాంతి పుంజాలతో ఒక మానవాకారం రమ్మని సైగ చేస్తున్నట్టుంది. ఏమి చేయాలో పాలుపోలేదు. ఒక పక్క వణుకు, దడ పుడుతుంటే ఇదెక్కడి సమస్య? పైగా రమ్మని పిలుపు కూడానూ! అసలు దెయ్యాలున్నాయా? ఈ ఆలోచనలో పడి లోపల దడగా వున్నా పైకి గంభీరంగా వుందామని యత్నిస్తున్నాడు కుమార్. మొహియుద్దీన్ ఇటువంటప్పుడు బోర్లా పడుకుంటే మంచిది సార్. దెయ్యాలు మనల్నేం చేయవు. అసలే కొరివి దెయ్యాలు గదా! క్రిందకు దిగండి సార్ అని అరచి యోబును పడుకోమని తను కూడా క్రింద పడుకున్నాడు. దూరం నుంచి ఓయ్! ఓయ్! అంటూ కేకలు విన్పిస్తున్నాయి. రైటో రైటో అంటూ కొన్ని కేకలు. కుమార్‌కి భయం వేసింది. క్రిందికి చూస్తే వీళ్ళిద్దరూ, బోర్లాపడుకుని వున్నారు. ఏం చేయాలో తోచలేదు. ఈ లోపల రెండు లైట్లు క్రిందికి, మీదికి దగ్గరికొస్తూ ఆడిస్తున్నట్టనించింది. వెంటనే అర్థమైంది కుమార్‌కి. దగ్గరకొస్తూ "మేం ఫాల్టు తీశేశాం సర్! ఫ్యూజ్‌వైర్ లైన్ మీద పడింది. లైన్లన్నీ రైటు. ఈ సంగతే చెబుదామని సిగ్నల్స్ ఇందాకటి నుంచీ ఇస్తున్నాం. మీ వద్ద నుంచి ఏ రకమైన సిగ్నల్స్ రాకపోయే సరికి మేమే వచ్చేశాం. అరే! మొహిద్దీన్ పడుకున్నావేంటి? అంటూ లేపారు ఊబునీ, మొహిద్దీన్‌నీ. ఇందాకటి నుంచి టార్చిలైటును క్రిందికీ, మీదకీ ఆడిస్తున్నాం మేము. నీకర్థం కాలేదా? అని అడిగారు విజయవాడ సైడు నుంచి వచ్చిన లైన్‌మెన్ రంగారావు, రాజు.

"మొహిద్దీన్! దెయ్యాన్ని జాగ్రత్తగా చూడు. ముందు ముందు కథలకి పనికి వస్తాయి" అన్నాడు కుమార్.